# భార్య

పరంధామయ్య శుద్ధశ్రోత్రీయుడు. శిథిలమైపోతున్న సనాతన సాంప్రదాయాలు ఆ యింట్లో యింకా జీర్ణించే వున్నాయి. జానకమ్మ అతని భార్య. భర్త కనుసన్నల్లో నడుచుకునే ఉత్తమ ఇల్లాలు. పరంధామయ్యకి యిద్దరు కొడుకులు. ఇద్దరు కూతుళ్ళు. పెద్దకొడుకు పేరు రఘు. చిన్న కొడుకు పేరు శర్మ. పెద్దకూతురు శాంత. చిన్నకూతురు దుర్గ.

పరంధామయ్యకి కాలేజి చదువులు ఏ మాత్రం ఇష్టం లేదు కానీ, రఘు ప్రతి క్లాసులో ఫస్టున వస్తూ, ప్రభుత్వం యిచ్చే స్కాలర్ షిప్ సంపాయించటంతో, అతని చదువు నిరాటంకంగా సాగిపోయింది. రఘు అంటే పరంధామయ్యకి ప్రాణం. చనిపోయిన తన తండ్రే- మళ్ళీ తన కడుపున రఘుగా జన్మించాడని ఆయన ఛాందస విశ్వాసం. మళ్ళీ తను చనిపోగానే రఘు కొడుకుగా పుడ్తానని, ఆయన గాఢ నమ్మకము. తండ్రీ కొడుకులుగా, మా యిద్దరిదీ జన్మజన్మల సంబంధం అని అంటూ వుండేవాడు.

మారుతున్న కాలంతో పాటు, కొత్త తరానికి ప్రతి నిధిగా, పెరిగి పెద్ద అయిన రఘుకి తండ్రి మూఢనమ్మకాలు, ఛాందస భావాలు, ఒకోసారి చాలా విసుగు కలిగించేవి. కానీ రఘుకి తండ్రి అంటే, వున్న విపరీతమైన గౌరవాభి మానాలవల్ల ఆ విసుగు బుద్బుదప్రాయం అయిపోయేది.

పరంధామయ్య పెద్దకూతురు శాంతకి భర్తపోయాడు. చిన్నతనంలోనే వైధవ్యం పొంది, అన్ని సుఖాలకి దూరం అయి యింట్లోనే వుంటోంది. రెండోకూతురు దుర్గకి వయసు వచ్చింది. పెళ్ళి చేయాలని సంబంధాలు చూస్తున్నారు. శర్మకి ఫాషన్లమీద చాలా మోజువుంది. కానీ ఛండశాసను డైన తండ్రి అంటే హడలు.

జానకమ్మకికూడా భర్త అంటే విపరీతమైన భయ భక్తులు. ఆవిడ జీవితం వంట యింటికే అంకితం అయి వుంటుంది. చాలా నియమ నిష్టలతో, నిర్దుష్టమైన నమ్మకా లతో ఆ కాపురం సంవత్సరాలుగా జరిగిపోతుంది.

ఒక్క యింట్లో వాళ్ళకే కాదు. చుట్టూవున్న తెలి సిన కుటుంబా లన్నింటికి కూడా పరంధామయ్య అంటే భయమే! అందరికీ సింహస్వప్నంలా బ్రతుకుతూ వచ్చాడు.

రఘు ఎం. ఏ. పాసయి హైదరాబాద్‌లో లెక్చ రర్ గా చేస్తున్నాడు. కుటుంబాన్నంతటినీ హైదరాబాద్ తీసుకువెళ్ళాలని అతని తాపత్రయం. కానీ పరంధామయ్య స్వస్థలం అయిన విజయవాడ విడిచి రావటానికి ఏ మాత్రం ఒప్పుకోలేదు. 'తెల్లవారి లేచిన తర్వాత దుర్గ దర్శనం చేసు

కోందే వుండలేను. నా తాతలు, వారి ముత్తాతలూ, ఇక్కడ కృష్ణ ఒడ్డున ఐక్యం అయ్యారు. నేను వాళ్ళని విడిచి దూరంగా వెళ్ళలేను. నువ్వే యిక్కడికి ట్రాన్సఫర్ చేయించుకో.' అని ఖచ్చితంగా చెప్పాడు. రఘు ట్రాన్సఫర్ కోసం ప్రయత్నిస్తున్నాడు.

* *

చల్లని సాయంకాలం. నదిఒడ్డున సుందరమైన ప్రకృతిలో, ఒక చెట్టును ఆనుకుని జయ కూర్చుని వుంది. ఆమె ఒడిలో తలపెట్టుకుని రఘు పడుకుని, ఆకాశంలో మేఘాలని పరికిస్తున్నాడు. జయ అతనికి ఎంతో యిష్టమైన అష్టపదిని మెల్లని స్వరాన పాడుతోంది. జయ చేయి, రఘు గుండెల మీద తాళం వేస్తున్నట్టుగా, వేళ్ళు కదులుతున్నాయి. రఘు సర్వం మరచి ఆ పాట వినటంలో మునిగిపోయినట్టుగా పడుకున్నాడు. పాట ముగిసింది.

"నీ గొంతులో అమృతం వుంది జయా." అంటూ అతను ఆమె మెడచుట్టూ చేతులు వేసి దగ్గరకు లాక్కున్నాడు.

"చాలా పొద్దుపోయింది" అంటూ గుర్రు చేసింది జయ.

రఘు వులిక్కిపడ్డట్టుగా లేచాడు. "నాకు ఫర్వాలేదు నీకు యిబ్బంది. మీ పిన్ని పంచాంగం విప్పుతుంది. పద పద" అన్నాడు.

వెళ్ళిపోటానికి బైలుదేరే ముందు, రఘు జయనిదగ్గరకి తీసుకున్నాడు. "నిన్ను విడిచి ఒక్క క్షణం కూడా వుండలేను అనిపిస్తోంది."

"నాకూ్కూడా" అంది జయ.

ఇద్దరూ నడక సాగించారు.

"నాన్నగార్కి వుత్తరం వ్రాశారా ?" అంది జయ.

"ఆఁ!" అన్నాడు రఘు.

జయ నిట్టూర్చింది.

"మన పెళ్ళికి ఆయిన అనుమతి యిస్తారంటారా ? నిప్పులాటి వంశం మీది. మచ్చవున్న తల్లి జీవితం నాది. మా పిన్ని ఒకసారి చెప్పింది. మీ నాన్నకి చాలా కోపంట! చాలా ఖచ్చితమైన మనిషిట కదా !"

"నిజమే జయా ! నాన్న అందరికీ పరమఛాందసుడుగా, ఆగ్రహమూర్తిగా కన్పిస్తాడు. కానీ వాటి వెనక అమృతంలాటి మనసు వుందని ఎవరికీ తెలియదు. ఒకసారి ఆ అమృతం రుచి చూస్తే, యిక ఎవరూ ఆయన్ని తప్పు పట్టలేరు."

"మీ అమ్మగారు ?"

"అమ్మ దేం లేదు. ఆవిడ జీవితం నాన్న జీవితంతో పాలు-నీళ్ళలా కలిసిపోయింది." జయ నిట్టూర్చింది.

"ఏమో రఘు! నాకు చాలా భయంగావుంది. ఈ వివాహం సవ్యంగా జరుగుతుందా? ఒకవేళ జరిగినా, ఎలాటి ఆటంకాలు లేకుండా మనం కాపురం చేయగలమా?"

రఘు పక్కకుతిరిగి జయని తనకి అభిముఖంగా తిప్పు కున్నాడు.

జయ రెండుచేతులూ పట్టిదగ్గరకు లాక్కుని గుండె లకి ఆనించుకున్నాడు.

"జయా! పెళ్లి జరిగేలా చూసేబాధ్యతనాది! తర్వాత అది విజయవంతం అయేలా చూసే పనినీది! మనిద్దరికీ ఒకరి పట్ల యింకొకరికి, నమ్మకం ప్రేమాభిమానాలు వున్నంత వరకూ, మన సంసార జీవితానికి ఎలాటి ఆటంకాలూ రావు. నీలో నమ్మకం ఏర్పరచుకో! నామీద నమ్మకం వుంచు. నేనుపుట్టి బుద్ధితెలిసిన తర్వాత, మా నాన్నని నొప్పించే ఏ పనీ చేయలేదు. నేను నిన్ను పెళ్ళాడడం ఆయనకి పెద్ద గొడ్డలిపెట్టే అవుతుంది. కానీ, తర్వాత, నీ నడవడి, నీ వ్యక్తిత్వం అర్థం చేసుకున్న తర్వాత ఆయన తప్పక నన్ను ఆశీర్వదిస్తారు. ఆ నమ్మకం నాకుంది. అందుకే యింత ధైర్యం చేస్తున్నాను చెప్పు. నాకు ప్రమాణం చెయ్యి, సహనంతో నీ సౌశీల్యంతో నా కుటుంబంలో అందరినీ, నీవైపు తిప్పుకో టానికి ప్రయత్నిస్తానని అను!" అంటూ చేయ చాచాడు.

జయ కళ్ళు చెమర్చినాయి.

"ఆ విషయం నువ్వు నాకు ప్రత్యేకంగా చెప్పాలా రఘూ!" అంది.

రఘు జయని గుండెలకి హత్తుకున్నాడు. "నాకు తెలుసు జయా! మాణిక్యంలాటి నువ్వు మా యింటికి శోభ తెస్తావనే నమ్మకం నాకుంది" అన్నాడు.

"రఘూ! అమ్మ జీవితం మంచిదికాదని, నేను పతిత కూతుర్ని అని, అందరిచేత యీసడించబడుతూ బ్రతికాను. నాకు నువ్వు పంచియించిన ప్రేమ అపరూపమైనది. నీ అండతో నేను జీవితంలో ఎన్ని ఎగుడుదిగుళ్ళయినా సహించ గలను రఘూ! నన్ను నమ్ము?" అంది.

"అయితే యివే మన పెళ్ళి ప్రమాణాలు." అన్నాడు రఘు చిరునవ్వుతో.

జయ కళ్ళలో తడి మెరుస్తుండగా నవ్వుతూ తల వూపింది.

* * *

ఆలస్యంగా యింటికివచ్చిన జయని చూసి మేనత్త వాకిట్లోనే నిలేసింది.

"ఏమే! అయినాయా నీ తిరుగుళ్ళు" అంది.

జయ సమాధానం చెప్పబోతూండగానే,ఆవిడ అదేం వినిపించుకోకుండా, "అయినా చింతచెట్టుకి చామంతిపువ్వు పూస్తుందా ఎక్కడైనా? ఆ పాపిష్టిదాని కడుపునపుట్టిన నీకు మంచిబుద్ధులు ఎలా వస్తాయే! మీ అమ్మ మొగుడుపోయిన తర్వాత లేచిపోతే నువ్వు పెళ్ళికాకుండానే, తిరుగుళ్ళు మొదలుపెట్టావు అంది. జయని దించి వెళ్ళిపోబోతున్న రఘు ఈమాటలువిని వెనక్కి తిరిగి దగ్గరగా వచ్చాడు.

"ఏమండీ! అనవసరంగా మాటలు మీరకండి. జయ నాతో వచ్చింది, జయా నేనూ పెళ్ళిచేసుకోబోతున్నాం!" అనేసాడు.

"ఏమిటీ!" మేనత్త నోరు తెరిచింది.

"రఘూ!" ఖంగారుగా చూసింది జయ.

మేనత్త కాళికావతారం ఎత్తింది. "ఏమిటీ పెళ్ళి చేసుకోబోతున్నారా! అయితే యింక మళ్ళీ మా యింట్లో దేనికి! నువ్వే తీసుకు వెళ్ళు. నేను ఆడపిల్లలుగలదాన్ని యిలాటి తిరుగుబోతుదాన్ని, యింట్లో పెట్టుకుంటే, నా కూతుళ్ళ పెళ్ళికూడా కాదు. వెళ్ళు యిప్పుడే తీసుకెళ్ళు దాన్ని." అంటూ లోపలికి వెళ్ళి జయ బట్టలు పెట్టె తెచ్చి బైట గిరాటకొట్టింది.

రఘు- జయ బ్రమాన్పడిపోయినట్టు నిలబడ్డారు. మేనత్త కేకలువిని, ఇరుగు, పొరుగూ చేరారు.

"అత్తయ్యా! మేం పెళ్ళిచేసుకోవాలనుకున్న మాట నిజమే! కానీ యిప్పుడుకాదు." జయ నచ్చచెప్పబోయింది.

"నోరుమూసుకో! నేనేం పిచ్చి చచ్చిందాన్ని అనుకున్నావా? పెళ్ళిచేసుకునే వాడికి యిప్పుడే తీసుకెళ్ళటానికి భయం ఎందుకే! అట్లా గుటకలు మింగుతాడే! మాట్లాడడే!" అప్పటికే అక్కడికి, ఇరుగు, పొరుగూ అందరూవచ్చి ఏమిటేమిటంటు మూగారు. జయ నిస్సహాయంగా రఘువైపు చూసింది.

రఘు ముఖం ఎర్రబడింది. నిశబ్దంగా వెళ్ళి జయ పెట్టె తీసుకున్నాడు 'జయా! నీ బట్టలు తీసుకో వెళదాం!' అన్నాడు గంభీరంగా.

జయ తనబట్టలు తీసుకుని, నిద్రలో నడుస్తున్నదానిలా అతని వెంట నడిచింది.

"పీడ విరగడ అయింది" మేనత్త వెనకనుంచి మెటికలు విరిచింది.

* * * *

పరంధామయ్యగారు పడక్కుర్చీలో కూర్చున్నారు. ఆయన కెదురుగా, చలమయ్యా అతని కొడుకు జోగయ్యా నిలబడివున్నారు. ఇద్దరి ముఖాలూ గండుపిల్లుల్లా వున్నాయి!

"మీ రెన్నయినా చెప్పండి పరంధామయ్యగారూ. మా నాన్నతో నేను చచ్చినా కలిసి వుండను. వేయిరూపాయలు కట్నం తక్కువైందని, నా భార్యని కాపురానికి తీసుకురావద్దంటాడు. ఇన్నాళ్ళుగా, రెక్కలు ముక్కలుచేసి వ్యవసాయంచేసి యింత తెచ్చి పోస్తున్నాను. అదిచూసయినా ఆ వేయి వదిలేయచ్చుకదా! అక్కడ దానికి తండ్రిపోయాడు. అన్నలు విదిలిస్తున్నారు, నేను బ్రతికుండగా దానికి ఆఖర్మ ఎందుకు రావాలీ అంట! ఈయన మూలంగానే కదా! నేను ఓపిక పట్టినన్నాళ్ళు పట్టాను. ఇక నావల్లకాదు. దానివుసురు నేను పోసుకోలేను. ఇష్టమైతే నా భార్యతోకూడా నేను వాళ్ళదగ్గర వుంటాను. కాదంటే వేరేపోతాను." అంటూ ఫిర్యాదు చేసాడు.

"అసలు సంగతి అదికాదు పరంధామయ్యగారూ! వీడు వ్యవసాయంలో నాలుగురాళ్లు వెనకేస్తున్నాడు. అదంతా మేం తినిపోతున్నాం అని వీడి దుగ్ధ. లేకపోతే యిన్నాళ్లు లేంది వీడికిప్పుడు పెళ్ళాం కావాల్సి వచ్చిందా!

చేస్తూనే వున్నాడుగా, ఆ కుంటి రత్తయ్య కూతురిని వుంచుకుని! కాపురం!" అంటూ చేతులు తిప్పాడు.

"ఇదుగో." అంటూ కొడుకు తండ్రిమీదకి వెళ్ళాడు.

"ఏం చేస్తావురా?" అంటూ చలమయ్యకూడా మీదికి వచ్చాడు.

పరంధామయ్య చప్పున కుర్చీలోనుంచి లేచి వెళ్ళి, తండ్రి కొడుకులని విడదీసాడు. "మీరిట్లా కాట్లకుక్కల్లా కస్సు, బుస్సు మంటే ఏం ప్రయోజనం. యిద్దరూ యిలా కూర్చోండి చెబుతాను." అంటూ యిద్దరినీ దూరదూరంగా కూర్చోపెట్టాడు. "ఇదుగో చలమయ్యా! పాత కక్షు లెట్లయినా వుండనీ! నీ కోడలు తండ్రి నిన్ను ఎంతయినా అవమానించనీ! వాడు భార్యను తెచ్చుకుంటానంటే సరేననడం నీ ధర్మం! నీ పౌరుషం నేను కాదంటం లేదయ్యా! నువ్వు నీ కోడలి చేతి గంజినీళ్ళు తాగనవసరం లేకుండా, నీ కూతురిని పెట్టుకుని విడిగా వుండు. ఇదిగో జోగులూ! యిక నువ్వు! నిన్ను అంత కష్టపడి పెంచి పెద్దచేసిన తండ్రిని నువ్విలా మాటలుఅనడం బాగాలేదు. రేపు నువ్వుకూడా ఒక తండ్రివి అయితేగానీ, నీకు ఆ కడుపు తీపి తెలిసిరాదు. మీ నాన్న వేరే వుంటాడు. వాళ్ళ మంచిచెడ్డలన్నీ నువ్వే చూడాలి. మీ నాన్న పెద్దవాడయ్యాడు. బ్రతికి నన్నాళ్ళు బ్రతకడు. ఈ వయసులో ఆయన్ని సుఖంగా, శాంతంగా బ్రతికేలా ఏర్పాటు చేయడం నీ ధర్మం. ఏమంటావు" అన్నాడు.

"నేనేం కాదనడం లేదుగదండీ" అన్నాడు జోగయ్య.

తండ్రీ కొడుకులు ఎలాగైతేనేం, చివరికి రాజీపడి పరంధామయ్యా చెప్పినట్టు చేయడానికి యిష్టపడి వెళ్ళి పోయారు.

వాళ్ళని పంపించి లోపలికి వచ్చిన పరంధామయ్యా, భార్యని మంచినీళ్ళు తీసుకురమ్మని కేక పెట్టాడు. ఇంతలో పోస్ట్‌మాన్ ఉత్తరం తెచ్చి పడేసి వెళ్ళాడు. జానకమ్మ మంచి నీళ్ళు తెచ్చి యిస్తూ, "ఎక్కడి నుంచండీ?" అని అడిగింది.

"మా నాన్న వ్రాశాడే!" అన్నాడాయన రఘుని ఎప్పుడు ఆయన పేరుపెట్టి పిలవడు. మా నాన్న, మా తండ్రి, మా బాబు అంటాడు. అదే శర్మ అయితే, 'నీ సుపుత్రుడు, మన వంశోద్ధారకుడు" అంటాడు.

జానకమ్మ భర్త కెదురుగా నిలబడింది.

ఆయన పూర్తిగా ఒకసారి చదివి తర్వాత భార్యకి చదివి వినిపించాడు. రఘు ఉత్తరంలో, "దీపావళి పండుగకి యింటికి వచ్చేటప్పుడు, అందరికీ ఒక కొత్త కానుక తెస్తానని వ్రాసాడు. అది ఏమై వుంటుందా అని ఆయన వూహాగానం చేశారు.

రఘు వ్రాసిన ఉత్తరం చదివి, దుర్గ, శర్మకూడా 'ఆ బహుమతి ఏమై వుంటుందా?' అని వూహాగానం చేశారు.

"అన్నయ్యా తప్పకుండా ఏదో మంచిదే తెస్తాడు" అంది శాంత.

ఇంట్లో అందరూ రఘు రాకకోసం ఎదురు చూడ సాగారు.

* * *

కాలేజినుండి యింటికి వచ్చిన రఘూకి, జయ కాఫీ తెచ్చి యిచ్చింది. రఘు కాఫీ కప్పు పక్కన పెట్టి భార్యని దగ్గరకి లాక్కున్నాడు. జయ అతని కౌగిలిలోనుండే, ఎదురుగావున్న కాలెండర్ వైపు చూపించి "ఈ రోజుకి వారం!" అంది.

యిద్దరూ రిజిష్టర్ మ్యారేజ్ చేసుకుని సరిగ్గా వారం అయింది.

"అప్పుడే వారం అయిందా! ఎనిమిది రోజులు గడిచాయా?" రఘు ఆశ్చర్యం నటించాడు.

"కాఫీ తాగండి. చల్లారి పోతుంది." జయ అతని కౌగిలి తప్పించుకుని లోపలికి వెళ్ళింది.

రఘు కాఫీ తాగడం పూర్తి చేస్తుండగా, 'యింటి దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది' అంటూ కవరు తెచ్చి చూపించింది.

రఘు చప్పున కాఫీ కప్పు టేబుల్ మీద పెట్టేసి, ఖంగారుగా 'ఏది? నాకింతవరకూ చెప్పలేదే?' అంటూ లేచి జయ దగ్గరగా వచ్చాడు. జయ చప్పున దూరంగా పరుగెత్తి, ఉత్తరం వెనక్కి దాచేసింది.

"నువ్వు చూశావా?" అన్నాడు.

"ఆ!" కళ్ళు తిప్పింది.

"ఏం వ్రాసాడు?"

"ముఖం వాచేలా చివాట్లు వేశారు. నీకు బుద్ధుందా లేదా? అలాటి పిల్లని పెళ్ళి చేసుకోటానికి నీకెంత ధైర్యం.

నిన్ను నరుకుతా. నమిలేస్తా అని వ్రాశారు" అంటూ యాక్షన్ చేసి చూపెట్టింది.

రఘు నిజంగా భయపడిపోయినట్లే నటించాడు.

"యిప్పుడెలా జయా !" అన్నాడు దిగులు నటిస్తూ.

"భలే వారండీ! యిదంతా నిజమేననుకున్నారా? నే నసలు చింపి చూడనేలేదు" అంటూ నవ్వుతూ దగ్గరికి వచ్చి యిచ్చింది.

"నేనప్పుడే అనుకున్నాన్లే !" అన్నాడతను నవ్వుతూ.

రఘు ఉత్తరం చదివి వినిపించాడు. అందులో జయ ఆశించినవేవీ లేవు పండగకి తప్పక రమ్మనమని, వీలయితే ఎక్కువ రోజులు శలవు పెట్టి రమ్మనమని వుంది.

"యిదేమిటండీ! మన విషయం ఏమీ వ్రాయలేదే" జాలిగా అంది జయ.

"వాళ్ళు నేను తేబోయే బహుమతి కోసం వేయి కళ్ళతో చూస్తానని వ్రాసారుగా."

"అంటే?" అర్థంగానట్టు అడిగింది.

"నేను వాళ్ళకి యివ్వబోతున్న బహుమతి నువ్వే !" అంటూ జయ బుగ్గ గిల్లాడు.

"అయితే మనం పెళ్ళి చేసుకున్నట్లు మీరు వ్రాయి లేదా?"

"ఊహు. అది ఉత్తరంలో వ్రాసేది కాదు. నేను స్వయంగా చెప్పాలి" అన్నాడు.

* * *

జయ—రఘూ ఎంతో వుత్సాహంగా బజారు వెళ్ళి యింటికి తీసుకు వెళ్ళాల్సిన సామాను కొన్నారు. రఘూ చెల్లెళ్ళని, తమ్ముడిని, తలితండ్రులని పేరు, పేరునా వర్ణిస్తూ, వారి గుణగణాలు వివరిస్తూ. అందరికీ బట్టలుకొన్నాడు.

రఘు శలవుపెట్టాడు. దంపతులిద్దరూ ఎంతో వుత్సాహంగా, వూరికి ప్రయాణం అయారు.

"ఏమిటో నాకు భయం వేస్తోందండి !" అంది జయ బేలగా.

"ఎందుకు !" లాలనగా చూసాడు.

"వాళ్ళేమంటారో ఏమిటో?"

"మనపెళ్ళి ప్రమాణాలు ఒకసారి గుర్తుచేసుకో ! ఏది ? యింకోసారి చెప్పు" అన్నాడు.

"సహనంతో; శాంతంతో, అత్తవారి కుటుంబాన్ని నాపట్ల ప్రసన్నం చేసుకుంటాను మీామీాద ఒట్టు!" చిలకలా అప్పచెప్పింది జయ.

"అదీ అలావుండాలి! గుడ్ గర్ల్! జయా! నీవ్యక్తిత్వంమీాద నాకు విశ్వాసంవుంది! ఆలస్యంగా నైనా, అమ్మా నాన్నా నిన్ను తప్పక కోడలిగా అంగీకరించి ఆదరిస్తారు. వాళ్ళకొడుకుని నేను ! వాళ్ళమనసు నాకు బాగా తెలుసు!" అన్నాడు రఘు గంభీరంగా.

* • •

జయ రఘూ ప్రయాణం చేస్తున్న బస్సు, హైద్రాబాద్‌నుంచి 20 మైళ్ళ దూరం వెళ్ళకుండానే యాక్సిడెంట్ కి గురి అయింది. అందరూ చాలా గాయపడ్డారు. కొద్దిమంది

మాత్రం అదృష్టవశాత్తూ ఎలాటి గాయాలు తగలకుండా తప్పించుకున్నారు.

రఘుకి తలమీద బలమైన గాయం అయింది. జయకి దెబ్బలేం తగలలేదు.

హాస్పటల్లో, చావు బ్రతుకులమధ్య వున్న రఘుని అతని ప్రాణస్నేహితుడైన డాక్టరు వేణు చూసాడు. జయ—రఘు పెళ్ళిచేసుకున్న విషయం అతనికి ఒక్కడికే తెలుసు. రఘుకి అతను శ్రద్ధగా వైద్యం చేయించే ఏర్పాట్లు చూసాడు. అయోమయంగా, మతిపోయినట్టుగా. శోకమూర్తిలావున్న జయని తనయింటికి తీసుకెళ్ళి ఆశ్రయం యిచ్చాడు.

డాక్టర్ వేణు జయకి చాలా ధైర్యం చెప్పాడు. రెండు మూడు రోజులు గడిచినాయి. రఘు మృత్యుకోరల నుంచి బైటపడ్డాడు. కానీ, అతని గతస్మృతులు మరచిపోయాడు.

వేణు ఈ వార్త వినిపించగానే జయకి గుండెలు బద్దలయినంత పని అయింది.

రఘు తలమీద గాయం పూర్తిగా మానటానికి కనీసం. రెండు మూడు నెలలైనా పడుతుంది. అంతవరకూ అతన్ని కంటికి రెప్పలా కాపాడాలి. ఎలాటి వుద్రేకానికి గురికానివ్వకూడదు!

జయకిచెప్పి డాక్టర్ వేణు, రఘుకి యాక్సిడెంట్ అయిన వుదంతం పరంధామయ్యకి వుత్తరం వ్రాసాడు.

* * *

వుత్తరం చూడగానే పరంధామయ్యా, భార్యా, పరుగెత్తుకువచ్చారు. మతి స్థిమితం తప్పిన కొడుకునిచూసి ఆయన భోరున విలపించాడు. యిద్దరు ముగ్గురు పెద్ద స్పెష లిస్టులకి చూపించినా, వాళ్ళుకూడా వేణుచెప్పిన మాటే చెప్పారు. పరంధామయ్యగారు క్రుంగిపోయినట్ట అయారు.

వేణు యింట్లో, అహర్నిశలూ రఘుని కంటికి రెప్పలా కాపాడుతున్న జయనిచూసి, ఆయన వేణుని, 'ఈ అమ్మాయి ఎవరు?' అని అడిగాడు.

"మీరే అడగండి." అని వేణు తప్పించుకున్నాడు.

పరంధామయ్యగారు, ఎంతో వాత్సల్యంగా చూస్తూ, "వాడికి కన్నతల్లిని మరపించేట్లు, సేవలుచేస్తున్నావు ఎవరు తల్లీ నువ్వు! మా అబ్బాయికీ నీకూ ఏమిటి సంబంధం!" అని అడిగాడు.

జయ పయిటలోంచి మంగళసూత్రం తీసి చూపించింది.

"యిదీ మా అనుబంధం?" అంటూ, రఘు తను రిజి ష్టర్ మేరేజ్ చేసుకున్న వైనం చెప్పలేక చెప్పింది.

పరంధామయ్య ముఖంలో శరవేగంగా రంగులు మారాయి.

"అబద్ధం!" అన్నాడు అరిచినట్టుగా.

వేణుకూడా అక్కడికి వచ్చాడు.

"నిజమే బాబాయ్! దీనికి నేనే సాక్షిని" అన్నాడు

పరంధామయ్య వ్యగ్రుడయిపోయాడు. యిది పూర్తిగా అసత్యం అని, రఘు యిలాటి వంచన తన కెన్నడూ చేయడని అన్నాడు. ఇందులో ఏదో మోసం వుందని అన్నాడు.

వేణునికూడా తిట్టాడు.

అప్పటి కప్పుడు, రఘుని తనవెంట తీసుకు వెళ్ళిపోతా నని, జయ విషయం తనకి తెలియదని అన్నాడు.

రఘుకి పరిస్థితి విషమిస్తోందని తెలిసింది.

"ఈ పరిస్థితుల్లో జయ సహాచర్యాల వుపచరణ రఘుకి ఎంతయినా అవసరం.

"జయ రావటం మీాకు యిష్టంలేకపోతే రఘుని ఇక్కడే వుండనివ్వండి. నేను పంపను" అన్నాడు.

పరంధామయ్యగారు, హతాశులైనట్లు చూసాడు.

"మాయిద్దరికీ పెళ్ళి అయినట్లు చట్టరీత్యా ఆధారాలున్నాయి. నన్ను రానివ్వని పక్షంలో, నాభర్తని నేను పంపను ఆ అధికారం నాకుంది," అంది జయ.

పరంధామయ్య వురిమిచూసాడు. కానీ చిత్తశుద్ధితో నిలబడిన జయకి ఆ చూపులు కించత్తుకూడా భయపెట్టలేదు.

"సరే! తగలడమను." అన్నాడు వేణుతో.

ఆయనకి రఘుకి మతిపోయిందనే బాధకంటే, ఈ అమ్మాయిని పెళ్ళిచేసుకున్నాడనే బాధే ఎక్కువైపోయింది.

భర్త అండదండలతో, అతను యిచ్చే మనస్థయిర్యముతో అత్తవారింట్లో అడుగుపెట్టాల్సిన జయ, ఒంటరిగా, మతి స్థిమితం తప్పిన అతనిని వెంటబెట్టుకుని ఆ యింటికి వచ్చింది. మామగారి కోరచూపులు, అత్తగారి నిర్లక్ష్యం, ఆడబడుచుల యీసడింపులు జయ ఆశించినట్టే ఎదురయినాయి. కానీ జయ ధైర్యం చెక్కుచెదరలేదు. మాటిమాటికీ రఘుకి

చేసిన పెళ్ళి ప్రమాణాలే నెమరువేసుకో సాగింది. పరిస్థితులు ఎంత చిత్రంగా మారినాయి? జయకి జీవితం అగ్నిపరీక్షలా తయారైయింది.

• • •

గాయపడి, మతిస్థితిమితం కోల్పోయిన రఘుని చూడటానికి చాలామంది వచ్చారు. అందరికళ్ళూ జయమీద ప్రశ్నార్థకంగా నిలిచిపోయాయి.

పరంధామయ్యాని! 'ఎవరండీ యీ అమ్మాయి!' అని అడుగక వాళ్ళు వదలలేదు... "మా వేణు పంపిన నర్సు..." అని సమాధానం చెప్పాడు. జయ ఈ జవాబు వింది.

జయకి - రఘుకి ఇంటికి ఎడంగావున్న గదిఇచ్చారు. జయ ఇంట్లో రావటానికి వీల్లేదని పరంధామయ్యా ముందే చెప్పాడు ఆయన పెట్టిన షరతులన్నిటికీ జయ అంగీకరించింది అక్షరాల ఆచరించసాగింది కూడా.

రఘుకి - జయకి భోజనం క్యారియర్‌తో వస్తుంది. కానీ ఆ క్యారియర్ యింట్లోకి రానివ్వరు; అది బైటవుండాల్సిందే!

• • •

రఘుకి దాదాపు శిష్యుడులాటి పాండు. పాండుకి రఘు యాక్సిడెంట్ విషయం తెలిసింది. జయకి సానుభూతి చూపించాడు. జయకి చాలా ఆసరాగా నిలిచాడు, జయకి ఏది కావాలన్నా నిముషాలమీద తెచ్చి ఇచ్చేవాడు.

ఒక నెల గడిచింది.

జయ ఆవూళ్ళో ట్యుటోరియల్ కాలేజీకి, లెక్చరర్ పోస్ట్‌కి అప్లైయిచేసింది ప్రిన్సిపాల్‌ని కలిసి తనగాథ వినిపించింది. ఆయన ఎంతో సానుభూతి చూపించి, జయకి వుద్యోగం యిచ్చాడు.

జయ మంగ అనే అమ్మాయిని చేతిక్రింద పనికి కుదుర్చుకుంది. ప్రిన్సిపాల్‌గారిని అడిగి అడ్వాన్స్ తీసుకుంది. పొద్దుని సాయం తీసుకెళ్ళి బజారులో, వంటశామానూ, మొదిలైనవి, ముఖ్యావసరవస్తులుకొని తెచ్చింది.

దుర్గ అహర్నిశలూ, జయ ఏంచేస్తున్నదీ సి. ఐ. డిలా కనిపెడుతూ, ఎప్పటికప్పుడు, తలితండ్రులకి ఈవార్త వినిపించింది.

జయ సామానుకొని తెచ్చింది అని చెప్పగానే, పరంధామయ్య పెద్దపెద్ద అంగలేస్తూ, జయగదికి వచ్చాడు. "ఏమిటిది?" అని నిలదీసాడు.

"ఎన్నాళ్ళని మీామీాద ఆధారపడటం! నాకాళ్ళమీాద నేను నిలబడాలని అనుకున్నాను." అంది జయ నిబ్బరంగా,

"డబ్బు ఎక్కడిది నీకు?"

జయ వుద్యోగం వచ్చినవైనం చెప్పింది,

"ఏమిటీ! వుద్యోగం చేస్తావా?" ఆయన మొహం పాలిపోయింది,

"అవును! భగవంతుడి దయవల్ల నాకు డిగ్రీవుంది, ఒకనాటి పనికాదు, అదిగాక వారికి మందులు, టానిక్కులకి చాలా డబ్బుకావాలి! "మిమ్మల్ని బాధపెట్టటం భావ్యం కాదు అనుకున్నాను."

పరంధామయ్య సమాధానం చెప్పలేకపోయాడు, వెళ్ళినదానికంటే, రెట్టింపు వేగంగాతిరిగివచ్చాడు, 'వుద్యోగం చేస్తుందిట, వుద్యోగం!' అంటూ గింజుకున్నాడు, జయని ఆటంకపరచలేని ఆయన యింట్లో వాళ్ళమీద చీటికీమాటికీ ఎగిరిపడసాగాడు, జయ చదువుకున్న పిల్ల। తనమంచి మనసుతో సౌశీల్యంతో ఖచ్చితమైన ప్రవర్తనతో ఎదుటవారిని నోరెత్త లేనట్టుగ చేస్తుంది,

జయ పరంధామయ్య చెప్పినట్టు కేవలం నర్సుకాదని వూళ్ళో అందరికీ అనుమానాలు రాసాగినాయి! గుస గుసలు మొదలైనాయి! జయ వుద్యోగంకూడా చేయటం చూసి వారి అనుమానాలు స్థిరపడ్డాయి,

పరంధామయ్య అంటే గిట్టనివాళ్ళు ఇంటికివచ్చి మరీ దెప్పిపొడుపుగా మాటలు అని వెళ్ళేవారు!

పరంధామయ్య యీ అవమానం మింగ లేక కక్క లేక వేగిపోతున్నాడు. ఆయన లాయర్ దగ్గరకెళ్ళి జయని వెళ్ళగొట్టే మార్గం ఆలోచించాడు, కాని లాయరుగారు అలాటిదేం కుదరదని చెప్పటంతో ఆయనకి మరింత నీరసం వచ్చింది!

శర్మ జయ కాలేజికి వెళుతుంటే పోకిరీగా మాట్లాడి జయచేత చెంపదెబ్బలు తిన్నాడు.

ఈమాట వినగానే, అందరూ నిశ్చేష్టులయ్యారు! పరంధామయ్య శర్మనే ఛడామడా తిట్టి తన ఆగ్రహం అంతా తీర్చుకున్నాడు. దుర్గ జయ కనిపిస్తేచాలు, సూటీపోటీగా

మాటలు అనేది శాంతమాత్రం జయని ఏమీ అనేదికాదు, సానుభూతిగా చూసేది! జయ శాంతతో మాట్లాడటానికి ప్రయత్నించింది కానీ శాంత బెదురుగా పారిపోయింది.

జానకమ్మ కొడుకుని చూడటానికి వచ్చే నెపంతో! ఇంట్లో చేసిన వేమైనావుంటే, కొంగుచాటున తెచ్చి, అక్కడ బల్లమీదపెట్టి వెళ్ళిపోయేది.

జయకి అత్తగారన్నా- శాంత అన్నా ఎంతో అభిమానం కలగసాగింది.

మంగ యిక్కడ, అక్కడ పనిచేస్తూ, ఒకరి విషయాలు ఒకరికి తెలియటానికి తోడ్పడేది.

• • •

దుర్గకి పెళ్ళి సంబంధం వచ్చింది. కానీ వాళ్ళు కట్నం ఎక్కువ కోరటంతో, తిరిగిపోయింది!

ఈ సంగతి మంగిద్వారా విన్న జయ తన నగలుఅమ్మి డబ్బు తెచ్చి మామగారికి యిచ్చింది.

"ఆ డబ్బు చూడగానే ఆయన వుగ్రనరసింహమూర్తి అయాడు!

"డబ్బుతో మమ్మల్ని కొనాలనుకుంటున్నావా? అంటూ తిట్టి పంపించాడు.

జయకి కళ్ళల్లో నీళ్ళు తిరిగినాయి! ఇవతలకి వస్తుంటే శాంతమూగగా సానుభూతిగా చూసింది.

• • •

జయ యింట్లో పెట్టిన డబ్బు శర్మ అర్ధరాత్రి వచ్చి కొట్టేయబోతూ పట్టుపడ్డాడు.

జయ అతన్ని చూసి నిర్ఘాంతపోయింది! 'శర్మా! నువ్వా! వుండు మీ నాన్నని పిలుస్తాను!" అంది.

శర్మ జయ కాళ్ళకి చుట్టేసుకున్నాడు. తనకి చాలా అప్పులు వున్నాయని, ఆ బాధ పడలేక యింత పని చేసానని చెప్పాడు. నాన్నకి తెలిస్తే చంపేస్తాడని, తెలియనీయవద్దనీ ప్రాధేయపడ్డాడు

జయ అతని అప్పులు ఎంతో కనుక్కొని, రెండు వందలు తీసి యిచ్చింది. జయ మంచి తనానికి శర్మ సిగ్గు పడిపోయాడు.

• • •

అర్ధరాత్రివేళ, జయ గదిలోనుంచి వస్తున్న శర్మని చూసి పరంధామయ్య వేరేరకంగా అర్ధం చేసుకున్నాడు. కొడుకుని జుట్టుపట్టిలాగి, ఎడా పెడా కొట్టాడు.

ఈ గలభా విని అందరూ లేచి వచ్చారు. జయకూడా వచ్చింది. జయ శర్మని కొట్టవద్దని అడ్డుపడింది.

"నీ గదిలోకివీడు యింత రాత్రివేళ ఎందుకు వచ్చాడో చెప్పు" అంటూ నిలదీసాడు.

శర్మ భయంగా జయ వైపు చూసాడు.

జయ ఆ కళ్ళలో అర్థింపుచూసి అసలు విషయం చెప్పలేకపోయింది,

అందరికీ యీ సంఘటన ఎలాగో అనిపించింది.

• • •

గోపాలానికి వురితాడు కంఠానికి మెల్లమెల్లగా బిగుసుకుంటునట్లుగా వుంది. ఎంత తిరిగినా ఎక్కడా ఎలాటి ఏ చిన్న వుద్యోగమూ దొరకలేదు. యిదివరకు వుద్యోగం లేదన్న బాధ ఒక్కటే! యిప్పుడు దాన్ని పెనవేసుకుని కొత్త సమస్యలు మరికొన్ని!

గోపాలం చివరకి సున్నిపుగానుగ వేసేచోట రోజు కూలీగా చేరాడు. ఆ సున్నం ఘాటు అతనికి పడలేదు. మొదటి రోజుకే కళ్ళమంటలు. విపరీతమైన దగ్గు వచ్చాయి. శాంత అదివద్దు మానేయమని హోరాహోరి పోట్లాడింది. గోపాలం వినలేదు. వున్నదాంట్లోనే తినవచ్చునని, శాంతని ఆ వంటపని మానేయమన్నాడు. నాలుగు రోజుల్లో నెల అయిపోతోంది. జీతం తీసుకొని మానేస్తానంది.

గోపాలానికి బట్టలమీద, తల దువ్వుకోవటంలో శ్రద్ధ నసించింది. గడ్డం చేసుకోవాలంటే విసుగు అనిపించేది. మాటిమాటికి, 'నీచేత యీ పని చేయించినవాడు రేపు పిల్లల్ని అడుక్కుతినమనికూడా పంపిస్తాడు' అన్న మామగారి మాటలు చెవుల్లో ఖంగుమనేవి! తనలాటి వాళ్ళకి అసలు పెళ్ళి చేసుకునే హక్కులేదు. చేసుకున్నా పిల్లల్ని కనే హక్కు అసలే లేదు. తను చేసినవన్నీ పొరపాట్లే! గోపాలంలో వున్న అభిమానం అతన్ని దహించివేయ సాగింది. మనిషి జీవితంమీద యిచ్ఛ నశించినట్టు తయారయాడు.

గోపాలం ఆరోజు చీకటి పడిన తర్వాత యింటికి వచ్చాడు. ఇంటికి రావాలంటే అతనికి వేదనగా వుంది. పిల్లలు లేనియిల్లు అతనికి స్మశానంలా కన్పిస్తోంది. శాంత వంటపని